చేవెళ్ల పార్లమెంటు పరిధిలో.. ఓటరు నమోదుకు 8,907 దరఖాస్తులు

రంగారెడ్డి, ఏప్రిల్ 16(నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికల్లో అర్హులైన వారు కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవడంతోపాటు సవరణలకు ఎన్నికల సంఘం అవకాశం ఇచ్చింది. ఈ మేరకు ఓటరు నమోదు, తొలగింపు, సవరణలకు దరఖాస్తుల స్వీకరణ గడువు ఈ నెల 15తో ముగిసింది. చేవెళ్ల పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో కొత్తగా ఓటు నమోదుకు 8,907 దరఖాస్తులు రాగా.. ఫామ్ 6ఎ కింద 7 దరఖాస్తులు, ఫామ్ 8 కింద 2,032 దరఖాస్తులు కలిపి మొత్తం 10,946 దరఖాస్తులు రాగా, వీటిని పరిశీలించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

నియోజకవర్గాలవారీగా దరఖాస్తులు ఇలా..

నియోజకవర్గం	ఫామ్-6	ఫామ్-6ఎ	ఫామ్ - 8
మహేశ్వరం	1,721	0	281
రాజేంద్రనగర్	2,627	03	727
శేరిలింగంపల్లి	2,558	04	852
చేవెళ్ల	1,083	0	118
పరిగి	265	0	16
వికారాబాద్	371	0	14
తాండూరు	282	0	24
మొత్తం	**8,907**	**07**	**2,032**

ధాన్యం సేకరణలో ఇబ్బందులు కలిగించొద్దు

వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి

పరిగి, ఏప్రిల్ 16 : రైతులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా ధాన్యం సేకరించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. డీసీఎంఎస్ ఆధ్వర్యంలో పరిగిలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతిలతో కలిసి కలెక్టర్ నారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేసేందుకు ముందస్తుగానే కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. 2023-24 యాసంగి సీజన్‌లో రైతుల నుంచి ధాన్యాన్ని సేకరించేందుకు అన్ని విధాలా సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. వరి ధాన్యానికి క్వింటాలుకు గ్రేడ్ ఏ కు రూ.2203, సాధారణ రకానికి రూ.2183 చెల్లిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో కావాల్సిన సదుపాయాలతోపాటు తూకం మిషన్లు, టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు, తేమ మీటర్లు, ప్యాడీ క్లీనర్లు, లైటింగ్ తదితర వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వేసవి దృష్ట్యా రైతుల కోసం ప్రత్యేకంగా టెంట్‌లు, మంచినీటి సదుపాయం కల్పించాలని సూచించారు. అనంతరం పరిగి పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో ఈవీఎం, వీవీ ప్యాట్స్ స్ట్రాంగ్ రూమ్‌ను కలెక్టర్ సందర్శించారు. అలాగే సీసీ కెమెరాల పనితీరును కలెక్టర్ పరిశీలించారు. అనంతరం పరిగి మండలం నస్కల్ గ్రామాన్ని సందర్శించిన కలెక్టర్ తాగునీటి సరఫరాపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం మంచినీటి సరఫరా చేస్తున్న బావిని కలెక్టర్ పరిశీలించారు. తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తుగానే గ్రామంలో అందుబాటులో ఉన్న బోర్లు, చేతిపంపులను మరమ్మతు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి రాజేశ్వర్, వ్యవసాయ శాఖ అధికారి గోపాల్, డీసీఎంఎస్ మేనేజర్ శ్యాంసుందర్‌రెడ్డి, వికారాబాద్ ఆర్‌డీవో వాసుచంద్ర, పరిగి తహసీల్దార్ ఆనంద్‌రావు, రైతులు పాల్గొన్నారు.

పరిగిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

మరోసారి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన కలెక్టర్..

సాధారణంగా ప్రభుత్వ పరంగా ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాలను ప్రజాప్రతినిధులు లేదా అధికారులు ఒకసారి ప్రారంభిస్తారు. ప్రస్తుతం పార్లమెంటు ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో అధికారులే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నారు. కాగా ఒకసారి ప్రారంభించిన కొనుగోలు కేంద్రాన్ని డీసీఎంఎస్ అధికారులు అత్యుత్సాహం చూపించి ఏకంగా కలెక్టర్‌తో మరోసారి ప్రారంభింపజేయడం తీవ్ర విమర్శలకు తావిస్తున్నది. డీసీఎంఎస్ ఆధ్వర్యంలో పరిగిలో ఏర్పాటు చేస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఈ నెల 5వ తేదీన డీసీఎంఎస్ జిల్లా మేనేజర్ శ్యాంసుందర్‌రెడ్డి ప్రారంభించారు. పట్టణంలోని డీసీఎంఎస్ గోదాంలో ఈ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇదిలావుండగా మంగళవారం కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఇదే ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మరోసారి ప్రారంభింపజేయడం తీవ్ర విమర్శలకు దారితీసింది. జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతితో కలిసి కలెక్టర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఒకసారి ప్రారంభించిన కేంద్రాన్ని ఏకంగా జిల్లా కలెక్టర్‌తో మరోసారి ప్రారంభోత్సవం చేయించడం సరికాదని పలువురు పేర్కొంటున్నారు. ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టించడం సరికాదని, ఇందుకు సంబంధించిన డీసీఎంఎస్ అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి

కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, ఏప్రిల్ 16 : ఓటరు జాబితా నమోదులో పెండింగ్ దరఖాస్తులను అన్ని ఈ నెల 25వరకు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. మంగళవారం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలో నాలుగు నియోజక వర్గాలకు సంబంధించి అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల సందర్భంగా తప్పులు లేని ఓటరు జాబితాగా రూపొందించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ నెల 18న నామినేషన్ ప్రక్రియ ప్రారంభం కానున్నందున జిల్లాలో ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ బృందాలు ఒక టీమ్ 8 గంటల చొప్పున 24 గంటలు పని చేసే విధంగా చూడాలని ఆదేశించారు. జిల్లాలో ఉండే చెక్ పోస్టులను పూర్తి స్థాయిలో చెక్ చేసేందుకు సిబ్బంది డ్యూటీలో ఉండేటట్లు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గం వారీగా ఏఆర్ఓలతో పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని, మిల్లర్లు జాప్యం లేకుండా సీఎంఆర్ ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. ధాన్యం రవాణా, డెలివరీ జరుగాలని సూచించారు. మిల్లింగ్ కెపాసిటీని బట్టి కొనుగోలు జరగాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, డీఎం, డీఎస్‌వో, తహసీల్దార్లు ప్రతి మిల్లును నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లింగ్యానాయక్, ఆర్‌డీవోలు వాసుచంద్ర, శ్రీనివాస్‌రావు, డీఎస్‌వో సంబంధిత అధికారులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదాలను నివారించాలి

కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, ఏప్రిల్ 16 : రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దృష్టి సారించాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. మంగళవారం రోడ్డు ప్రమాదాల నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై జిల్లా ఎస్పీ ఎన్. కోటిరెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతితో కలిసి కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా ఎస్పీ మూడు సంవత్సరాలుగా సంభవిస్తున్న రోడ్డు ప్రమాదాల వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో రోడ్డు ప్రమాదాలు జరుగడానికి కారణాలను క్షుణ్ణంగా అధ్యాయనం చేయాలన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్న 16 బ్లాక్ స్పాట్స్‌ను ఆర్‌అండ్‌బీ, పోలీస్ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించి ప్రమాదాలు జరుగడానికి కారణాలను తెలుసుకోవాలని కలెక్టర్ సూచించారు. రహదారులపై ప్రమాదాలు జరిగినప్పుడు అత్యవసర చికిత్సలు అందించేందుకు వీలుగా అంబులెన్స్ సౌకర్యం, పరిసర ప్రాంతాల్లోని దవాఖానాల్లో సిబ్బంది అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. మద్యం తాగి డ్రైవింగ్ చేసిన వారిపై నిఘాను పెంచాలని, అదేవిధంగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు అయినట్లయితే కేసులు నమోదు చేసి వారి లైసెన్స్‌ను తప్పనిసరిగా రద్దు చేసేలా కచ్చితమైన నిర్ణయం తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. రోడ్ల పక్కన ఉన్న బెల్ట్ షాపులను గుర్తించి వాటిని వెంటనే తొలగించాలని ఆదేశించారు. పోలీస్, రవాణా శాఖ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి వివిధ వాహనాల తో పాటు పాఠశాలల్లో అద్దెకు తీసుకొని నడిపిస్తున్న బస్సుల ఫిట్‌నెస్, డ్రైవర్ లైసెన్సులను తనిఖీ చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. పట్టణ, మున్సిపల్ కేంద్రాల్లో పార్కింగ్ స్థలం లేకపోవడంతో ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలపడం కారణంగా ప్రజలు అసౌకర్యానికి గురి అవుతున్నారని, పరిసర ప్రాంతాల్లో పార్కింగ్ నిమిత్తం స్థలాలను గుర్తించి ప్రతిపాదనలు సమర్పించినట్లయితే పాలపరమైన మంజూరు ఇస్తామని కలెక్టర్ తెలిపారు. మున్సిపల్ కూడళ్లల్లో సీసీ కెమెరాలు, సూచిక బోర్డుల ఏర్పాటుకు కావలసిన నిధుల కోసం ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. రహదారుల్లో బ్రిడ్జిలను గుర్తించే విధంగా రేడియంతో కూడిన సూచిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు, బ్లింకర్స్ వంటివి సరి చూసుకోవాలన్నారు. పంట నూర్పిళ్ల వల్ల జరిగే ప్రమాదాలపై రైతుల్లో అవగాహన కల్పించాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో ఆర్‌అండ్‌బీ ఈఈలాల్ సింగ్, పంచాయతీరాజ్ ఈఈ ఉమేశ్, డీఎంహెచ్‌వో పల్వన్ కుమార్, జిల్లా రవాణా శాఖ అధికారి వెంకట్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు, పోలీస్ అధికారులు, ఇంజినీరింగ్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు వందశాతం పూర్తి చేయాలి

వికారాబాద్, ఏప్రిల్ 16 : జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనుల కోసం ప్రతి గ్రామంలో యాక్టివ్ లేబర్‌ను సమీకరించి గ్రామ ప్రజలకు ఉపయోగపడే పనులు వందశాతం పూర్తి అయ్యేలా ఎన్ఆర్ఈజీఎస్ టీం ముందుకెళ్లాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం టెలికాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనుల్లో కూలీల సంఖ్యను పెంచుతూ పనులు వేగవంతం చేయాలన్నారు. పంచాయతీ పనుల్లో లేబర్ సమీకరణ చేస్తూ పద్ధతి ప్రకారం పనులు చేపడితే అనుకున్న లక్ష్యం చేరుకోవచ్చని సూచించారు. లేబర్ మొబిలైజేషన్ చేస్తూ గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ పనులు మానిటరింగ్ చేసి, ప్రతి హ్యాబిటేషన్‌కు పనులు చేయించాలన్నారు. లేబర్ తక్కువ ఉన్న గ్రామాలపై దృష్టి పెట్టి గ్రూప్ ఏర్పాటు చేసి లేబర్ సమావేశాలు నిర్వహించి అంచనా ప్రకారం ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్యను పెంచి, 100 శాతం పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. పనులు పూర్తి అయిన వాటికి ఎఫ్‌టీవో జనరేట్ చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు, సిబ్బందిని అభినందించారు. టెలీకాన్ఫరెన్సులో డీఆర్‌డీఏ శ్రీనివాసులు, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, ఎంపీడీవోలు, ఏపీవో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సీతారాముల విగ్రహాలను పల్లకిలో ఊరేగిస్తున్న భక్తులు

ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

ఘనంగా ఎదుర్కోలు ఉత్సవం

మంగళ హారతులతో తరలి వచ్చిన మహిళలు

బొంరాస్‌పేట, ఏప్రిల్ 16 : శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా బొంరాస్‌పేటలో మంగళవారం సాయంత్రం సీతారాముల ఎదుర్కోలు ఉత్సవం ఘనంగా జరిగింది. భూలక్ష్మీ దేవాలయంలో పూజలు నిర్వహించిన అనంతరం సీతారాములు, లక్ష్మణుడి విగ్రహాలను పల్లకిలో ఉంచి భజనలు చేసుకుంటూ పాటలు పాడుతూ, జైశ్రీరాం, జైజై శ్రీరాం అంటూ మేళతాళాలు మంగళ వాయిద్యాలతో గ్రామంలోని వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. విగ్రహాలను శ్రీ సంగమేశ్వర భక్త సమాజానికి తరలించారు. బుధవారం కల్యాణం నిర్వహించనున్నారు. ఊరేగింపులో గ్రామంలోని దుర్గామాత, శ్రీ ఆంజనేయస్వామి దేవాలయాల్లో పూజలు చేశారు. భక్తులతో పాటు మహిళలు మంగళహారతులతో పెద్ద ఎత్తున తరలివచ్చి ఎదుర్కోలు ఉత్సవంలో పాల్గొన్నారు. అంతకుముందు సంగమేశ్వర భక్త సమాజంలో సీతారాముల విగ్రహాలకు పురోహితుడు జోషి సత్యనారాయణ రావు ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం నిర్వహించి పట్టు వస్త్రాలతో అలంకరించారు. బుధవారం జరిగే సీతారాముల కల్యాణానికి మండలంలోని బొంరాస్‌పేటతో పాటు బురాన్‌పూర్, మెట్లకుంట, దుద్యాల మండలంలో లగచెర్ల తదితర గ్రామాల్లో భక్తులు ఘనంగా ఏర్పాట్లు చేశారు.

వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్‌గా

ఉమా హారతి

వికారాబాద్, ఏప్రిల్ 16 : వికారాబాద్ జిల్లా అసిస్టెంట్ కలెక్టర్‌గా ఉమా హారతి ఐఏఎస్ మంగళవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఉమా హారతి 2022-23 సంవత్సరంలో ఆల్ ఇండియాలో 3వ ర్యాంక్ సాధించారు.

స్ట్రాంగ్ రూంను పరిశీలించిన అదనపు కలెక్టర్

కొడంగల్, ఏప్రిల్ 16: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటైన స్ట్రాంగ్ రూంను అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ మంగళవారం పరిశీలించారు. జరుగబోయే పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా ఎన్నికల నిర్వహణ పనులు అధికారులు ముమ్మరంగా చేపడుతున్నారు. పోలింగ్ ప్రక్రియలో భాగంగా ఇదివరకే ఎన్నికల నిర్వహణ అధికారులకు శిక్షణా కార్యక్రమాలను నిర్వహించి ఎన్నికల్లోని పోలింగ్ ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈవీఎం, వీవీ ప్యాడ్‌లపై ఓటర్లకు అవగాహన కల్పించారు. అదే విధంగా పోలింగ్ అనంతరం ఈవీఎం, వీవీ ప్యాడ్లు భద్రపరిచే స్ట్రాంగ్ రూంను తహసీల్దార్ విజయ్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. స్ట్రాంగ్ రూం భద్రతలు, ఏర్పాట్లపై ఆరా తీశారు.

రేపటి నుంచి చిలుకూరు బాలాజీ బ్రహ్మోత్సవాలు

మొయినాబాద్, ఏప్రిల్16 : చిలుకూరు బాలాజీ ఆలయం బ్రహ్మోత్సవాలు ఈ నెల 18వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. బాలాజీ బ్రహ్మోత్సవాలను ప్రతి ఏడాది శ్రీరామ నవమి మరుసటి రోజు నుంచి ప్రారంభిస్తారు. ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహిస్తారు. 18న సెల్వర్ కూత్తు, అంకురార్పణం కార్యక్రమాలతో ప్రారంభించి 25న చక్ర తీర్థం కార్యక్రమంతో ముగిస్తారు. 19న ధ్వజారోహణం, శేషవాహనం, 20న గోపవాహనం, హనుమంత వాహనం, 21న సూర్యప్రభ, గరుడ వాహనం, సాయంత్రం కల్యాణోత్సవం, 22న వసంతోత్సవం, గజ వాహనం, 23న పల్లకి, రథోత్సవం, 24న మహాభిషేకం, ఆస్థాన సేవ, అశ్వ వాహనం, డోప్ సేవ, పుష్పాంజలి, 25న చక్రతీర్థం, ధ్వజావరోహణం కార్యక్రమాలు ఉంటాయని అర్చకులు రంగరాజన్ తెలిపారు. అందుకు అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు.

'ఆటోమేషన్'తో నాణ్యమైన విద్యుత్

వేసవి డిమాండు తట్టుకునేలా అన్ని ఏర్పాట్లు
సీఎండీ ముషారఫ్ ఫరూఖీ
కళ్యాణ్‌నగర్‌లో స్కాడా, సబ్ స్టేషన్ తనిఖీ

సిటీబ్యూరో, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): విద్యుత్ సరఫరా వ్యవస్థలో ఆటోమేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి, నిరంతరం నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయడంపై దృష్టి సారించామని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ అన్నారు. మంగళవారం బంజారాహిల్స్ సర్కిల్ కళ్యాణ్‌నగర్‌లోని సబ్ స్టేషన్‌లో విద్యుత్ సరఫరా తీరును, స్కాడా కేంద్రాన్ని ఆయన సర్కిల్ ఎస్ఈ చంద్ర శేఖర్‌తో కలిసి పరిశీలించారు. నాణ్యమైన విద్యుత్ సరఫరా జరుగాలంటే డిస్కం పరిధిలోని నెట్‌వర్క్ మొత్తాన్ని ఆటోమేషన్ చేయాల్సి ఉంటుందని, ఈ ప్రక్రియను పూర్తి చేసి కొత్తగా ఆధునీకరించిన మొబైల్ యాప్‌తో అనుసంధానం చేయనున్నామని సీఎండీ తెలిపారు. ఏటా విద్యుత్ డిమాండు గణనీయంగా పెరుగుతున్నదని, దాన్ని దృష్టిలో పెట్టుకొని సర్కిళ్ల వారీగా సబ్‌స్టేషన్ల ఏర్పాట్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ ఫార్మర్స్, కొత్తగా లైన్లను ఏర్పాటు చేసుకోవాలని సర్కిళ్ల ఉన్నతాధికారులకు సూచనలు చేశామన్నారు. వేసవి కార్యాచరణలో భాగంగా ఏయే సర్కిళ్లలో ఎలాంటి మౌలిక వసతులు కల్పించారన్న విషయాలను ఆరా తీశారు. ముఖ్యంగా లోడు ఏ ప్రాంతంలో ఎక్కువగా ఉంది, ఇందుకు అనుగుణంగా ఎలాంటి ఏర్పాట్లు చేయాలన్న దానిపై నివేదికలు ఇవ్వాలని సూచించారు.

బంజారాహిల్స్ సర్కిల్ కళ్యాణ్‌నగర్‌లోని సబ్ స్టేషన్‌లో విద్యుత్ సరఫరా తీరును తనిఖీ చేస్తున్న సీఎండీ ముషారఫ్ ఫరూఖీ

ఉన్నతాధికారులు సూచనలు..

సబ్ స్టేషన్ తనిఖీలో భాగంగా లోడ్ ఎంత ఉంది? అదనంగా పెరిగితే ఎలాంటి ఏర్పాట్లు చేయాలని ఎలక్ట్రికల్ ఇంజినీర్లను అడిగి తెలుసుకున్నారు. లాగ్ బుక్ తనిఖీ చేసి.. 33 కేవీ, 11 కేవీ ఫీడర్ల పరిధిలో జరిగిన అంతరాయాలు, వాటి సమయం ఎంత మేర ఉందని చూశారు. సబ్ స్టేషన్లలో ఉన్న పవర్ ట్రాన్స్‌ఫార్మర్స్ పనితీరును, బ్రేకర్స్, రిలే పరికరాలు వంటి వాటిని ప్రత్యేకంగా పరిశీలించారు. సబ్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు భద్రతా ప్రమాణాలను పాటించాలని, హెల్మెట్‌లను, ఎర్త్ రాడ్‌లను, ఇతర భద్రతా వస్తువులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

వాహనాల తనిఖీలో నగదు పట్టివేత

ఆదిబట్ల, ఏప్రిల్ 16: ఎంపీ ఎన్నికల దృష్ట్యా ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో వాహనాలు తనిఖీ చేస్తుండగా 3లక్షల 10వేలు పట్టుకున్నారు. ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం సాయంత్రం ఆదిబట్ల ఔటర్ రింగురోడ్డు సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ వ్యక్తి నుంచి 2లక్షల 10 వేలు ఎలాంటి రశీదులు లేకుండా తరలిస్తుండటంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా వండర్‌లా వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా మరో వ్యక్తి నుంచి లక్ష రూపాయలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వాటిపై సరైన పత్రాలు చూపించి తీసుకెళ్లాలని అన్నారు. స్వాధీనం చేసుకున్న డబ్బు ఎన్నికల కమిషన్ పరిధిలోకి వెళుతుందని అన్నారు.

పలు కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 16: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని పలు కోర్సుల పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ పరీక్షల విభాగం, కంట్రోలర్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. మూడేండ్ల ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్‌బీ ఆనర్స్, ఆరో సెమిస్టర్, ఐదేండ్ల బీఏ – ఎల్ఎల్‌బీ, ఐదేండ్ల బీబీఏ ఎల్ఎల్‌బీ, ఐదేండ్ల బీ కామ్ ఎల్ఎల్‌బీ పదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును ఈ నెల 29వ తేదీలోగా సంబంధిత కళాశాలలో చెల్లించాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో వచ్చే నెల 3వ తేదీలోగా చెల్లించవచ్చన్నారు. ఎంఈడీ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును వచ్చే నెల 2వ తేదీలోగా, రూ.200 అపరాధ రుసుముతో 4వ తేదీలోగా చెల్లించాలన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

విదేశీ భాషల్లో డిప్లొమా కోర్సులకు దరఖాస్తులు

ఓయూ పరిధిలో వివిధ విదేశీ భాషల్లో డిప్లొమా కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఫ్రెంచ్, జర్మన్ భాషల్లో నాలుగు నెలల జూనియర్, సీనియర్ డిప్లొమా కోర్సులతో పాటు ఏడాది అడ్వాన్స్‌డ్ డిప్లొమా కోర్సును అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కోర్సుల తరగతులను జూలై ఎనిమిదో తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన వారు జూనియర్ డిప్లొమాలో చేరేందుకు అర్హులని పేర్కొన్నారు. సీనియర్ డిప్లొమాలో చేరేందుకు కనీసం యాభై శాతం మార్కులతో జూనియర్ డిప్లొమా కానీ, యూజీలో సంబంధిత భాషను సెకండ్ లాంగ్వేజ్‌గా చదివి ఉండాలని చెప్పారు. అడ్వాన్స్‌డ్ డిప్లమాలో చేరేందుకు కనీసం యాభై శాతం మార్కులతో సీనియర్ డిప్లొమా పాసై ఉండాలన్నారు. దరఖాస్తులను ఆన్‌లైన్ విధానంలో పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. ఇతర వివరాలకు విదేశీ భాషల విభాగం కార్యాలయంలో గాని, ఫోన్ నం.83310 41309లో గాని సంప్రదించాలని సూచించారు. దరఖాస్తులు దాఖలు చేసేందుకు జూలై 6వ తేదీ ఆఖరు అని చెప్పారు.

ఎం ఫార్మసీ పరీక్షా ఫలితాల విడుదల

ఓయూ పరిధిలో ఎం ఫార్మసీ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ప్రొ. రాములు తెలిపారు. అన్ని స్పెషలైజేషన్ల ఎం ఫార్మసీ (సీబీసీఎస్) సెమిస్టర్ ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు.

ఎంఈడీ జవాబు నకలు పత్రాలు పొందేందుకు..

ఓయూ పరిధిలోని ఎంఈడీ జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఎంఈడీ రెండో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశారు. జవాబు పత్రాల నకలు పొందేందుకు ఒక్కో పేపర్‌కు రూ.1,000 చొప్పున చెల్లించి ఈ నెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

రేపటి నుంచి ఓయూలో టెక్నోస్మానియా - 2024

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 16: ఉస్మానియా యూనివర్సిటీ టెక్నాలజీ కళాశాలలోని అన్ని విభాగాల్లో ప్రతి ఏటా నిర్వహించే టెక్నికల్ ఫెస్ట్ టెక్నోస్మానియా – 2024 వేడుకలు గురువారం నుంచి నిర్వహించనున్నారు. మూడు రోజుల పాటు జరుగనున్న ఈ ఫెస్ట్‌లో భాగంగా పలు విభాగాల్లో పోటీలు నిర్వహిస్తారు. వివిధ అంశాలపై నిపుణులతో ఉపన్యాస కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేస్తారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ పోటీలలో విద్యార్థులకు తమ ప్రతిభను ప్రదర్శించే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పలు కళాశాలల నుంచే కాకుండా దేశంలోని ఇతర రాష్ట్రాల నుంచి విద్యార్థులు ప్రతి ఏటా పెద్ద ఎత్తున పాల్గొంటారు. ఈ వేడుకలు విజయవంతం చేయాలని కళాశాల విద్యార్థులు చేపట్టిన బైక్ ర్యాలీని ప్రిన్సిపాల్ ప్రొ. చింత సాయిలు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం, టెక్నోస్మానియా కన్వీనర్ ప్రొఫెసర్ శ్రీనూనాయక్ మాట్లాడుతూ, కళాశాలలోని కెమికల్ టెక్నాలజీ, ఫుడ్ టెక్నాలజీ, టెక్స్‌టైల్ టెక్నాలజీ, ఫార్మసీ, హోటల్ మేనేజ్‌మెంట్ విభాగాలలో వరుసగా కెటాలసిస్, ఫుడ్ సినర్జిజం, టెక్స్‌క్రోమా, టెక్నో ఫార్మా, టెక్నో హాస్పిటాలిటీ పేర్లతో పోటీలను నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇప్పటికే కొన్ని రాష్ట్రాల్లో తీవ్ర నీటి సంక్షోభం తలెత్తిందని గుర్తు చేశారు. రానున్న రోజుల్లో మన రాష్ట్రంలోనే ఆ పరిస్థితి తలెత్తే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. అందుకే 'సేవ్ వాటర్' థీమ్‌తో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈసీఐఎల్‌లోని ఏఎంఆర్ ప్లానెట్ మాల్‌లో సా